






డ్రైవరు సిగరెట్టు కాలుస్తుంటే, రైలింజను పొగ వదులుతోంది. బెడ్డింగు భుజంమీద పెట్టుకుని గోపాలం వస్తుంటే కూలీ వెనకాల పెద్దపెద్ద అంగలు వేసుకుంటూ వస్తున్నాడు. 'పోనీ ...ఆ రణాలు ఇప్పించండి ...' అంటున్నాడు. కూలీ గోపాలం చేతిలో బెడ్డింగు లాక్కుంటున్నాడు. గోపాలం అడుగు ముందుకు సాగటంలేదు.

బండీ కూడ కూసింది.

'ఇట్లాగయితే మీకు బండే అందదు...ఆ రణాలకోసం చూస్తున్నారు...' కూలీ బెడ్డింగు అందుకున్నాడు_బలవంతాన. గోపాలం కళ్ళల్లోకి నీళ్ళురాకుండా జాగ్రత్తపడ్డాడు.

'అబ్బా...ఇంత బరువుందే.. బియ్యం కట్టుకుపోతున్నారా బాబూ...'

కూలీని ఏమన్నా అంటే సామాను తూకం తూయించాలి అంటాడేమోనని భయం.

గోపాలం వళ్లు మండిపోతోంది. అక్కడ రైలింజనుకూ అంతే.

'హైదరాబాదుపెట్టిలో పెట్టు...'

'పెట్టి ప్లాటుఫారం చివర కుంటుంది,. తొందరగా నడవండి...' కూలీ బెడ్డింగుతో పరుగెత్తుతున్నాడు. దొంగ వెంబడి పోలీసులా గోపాలం అడుగు వేస్తున్నాడు.

'ఎక్కండి...ఎక్కండి...'

గేటునిండా జనం. రంగుల రాటంలా ఉంది రైలుపెట్టె. ఇంజను నీళ్ళు తాగుతోంది. గార్డు కాఫీ తాగుతున్నాడు.

'ఎట్లా ఎక్కటం...' గోపాలం కంగారు పడుతున్నాడు. 'ఎట్లా ఎక్కడం అంటారేంటి...? రైలు ముఖం ఎరగని వాళ్ళలా...కిటికీలోంచి ఎక్కండి...' కూలీ ధైర్యం చెప్పాడు.

కిటికీలోనుంచి ఎక్కేవాళ్ళు, దిగేవాళ్ళు.

గోపాలం కిటికీ దగ్గరకు వెళ్ళి తల లోపల పెట్టాడు. లోపలాయన మెడ పట్టుకున్నాడు. వసంతసేనలో చోరుడి సూచన ప్రకారం అయితే కాళ్ళు ముందు పెట్టాలి.

కూలీ బెడ్డింగును విసిరివేశాడు ఫిరంగి గుండును విసిరేసినట్లు. అది వెళ్ళి మనుష్యులమీద పడి నానా తిట్లు తిని ఒక మూలకు చేరింది. బండీ బయలుదేర బోతోంది. గోపాలం 'నా బెడ్డింగు... నా బెడ్డింగు...' అని అరుస్తున్నాడు.

బెడ్డింగును చూస్తే గోపాలానికి భార్య గుర్తుకు వస్తుంది.

కూలీ గోపాలాన్ని బలవంతానా కిటికీ గుండా లోపలకు దూర్చేసి మెడ పట్టుకున్నాడు. 'కూలీ ఇప్పించండి...బండి పోతోంది...' గోపాలం జేబు తడుముకున్నాడు. చిల్లర లేదు. ఎక్కడ జారిపోయిందో! అర్ధరూపాయి బిళ్ళమాత్రం చేతికి తగిలింది.

'చిల్లరుందా...?'

కూలీ అర్ధరూపాయి అందుకున్నాడు. 'చిల్లర కావాలట చిల్లర...గేదె గొడ్డంత బరువుంది బెడ్డింగు...' అన్నాడు. అని తిరిగి చూడకుండా వెళ్ళిపోయాడు.

చిచ్చుబుడ్డిలో మందు కూరినట్లు, బీరువాలో పుస్తకాలు సర్దినట్లు...రైల్లో ప్రయాణీకులు నిలబడ్డారు.

పొద్దున్నే పదిగంటల కల్లా ఆఫీసు. జి. టి. లో పోతేగాని అందదు. లేకపోతే ఏ హౌరా ఎక్స్‌ప్రెస్‌లోనో మెల్లిగా పోవచ్చు. పెట్టెలో నిలబడటానికి గూడా చోటులేదు. వళ్ళంతా నీళ్ళు కారిపోతున్నాయి. పంఖాలు తిరుగుతున్నాయి. రైలు చక్రాలు తిరిగితేనే గాని పెట్టెలోకి గాలి రాదు.

బయట పాన్, బీడీ, సిగరెట్టు వాళ్ళ గోలకంటె లోపల సందడి ఎక్కువగా ఉంది. బెజవాడ ప్లాటుఫారం అరవిపిల్లి సంతలా ఉంది. ఏ ఊర్లో వాళ్ళకి ఆ ఊర్లో ఉద్యోగమో, వ్యాపారమో

ఉంటే రైలు ప్రయాణాల అవసరం ఇంత ఉండదు. చేసేది గుమాస్తాగిరి. 'హైదరాబాదులో ఉద్యోగం...' అని అందరూ అనుకోవడం.

అంతకంటే స్వంత ఊర్లో చింతపండు దుకాణం లాభసాటి. రైలు పెట్టెలో ఒక మూల చింతపండుబుట్ట ఉంది వ్యాపారానికో, వాడకానికో.

'అబ్బాయ్ గోపాలం...గోపాలం..' బయటనుంచి ఎవరో పొలికేకలు పెడుతున్నారు. గోపాలం తల కిటికీదాకా రాలేకపోయింది. ఒక్క నిమిషం ఆగాడు. కేకలు పెట్టినవాడు కిటికీ దగ్గరకు వచ్చాడు. పరంధామయ్యా పంతులు.

'నువ్వు వెంకట్రామయ్య కొడుకువి గాదటరా'...అన్నాడు.

'అవునండి...'

'హైదరాబాదుకేనా ప్రయాణం...'

'అవునండి...'

'మా అమ్మాయి పార్వతి గూడ ఈ బండిలోనే వస్తోంది...'

'ఎక్కడండి...'

'ఈ పెట్టెలోనే ఎక్కించానులే ... అక్కడ బండిదగ్గరకు మా వాళ్ళు వస్తారు గాని...ప్రయాణంలో కాస్త కనిపెట్టుకుని ఉండు...'

'అట్లాగేనండి...'

'పెద్దసామానేం లేదుగాని...పెట్టె.. మూట...నేతి డబ్బా ఉన్నాయి...... ఆవకాయ జాడీ అయితే తాటాకు బుట్టలో కట్టాం లే...కొంచెం వాటి సంగతిగూడా కనిపెట్టి ఉండు...'

'అట్లాగే...'

'నిన్ను చూస్తే నాకు ప్రాణం లేచి వచ్చినట్లయింది......వంటరిగా దాన్ని పంపాలంటే హడిలిపోయాను...తప్పని సరై ప్రయాణం కట్టించాం ... నువ్వున్నావు కాబట్టి నాకు నిశ్చింత...' గోపాలం కొయ్యలాగా నిలబడ్డాడు. అన్నిటికీ తలూపుతున్నాడు. పరంధామయ్య కిటికీలోనుంచి లోపలకు వస్తాడేమోనని హడిలిన వాళ్ల గుండెలు కుదటపడ్డాయి.

రైలు కొద్దిగా వెనక్కు పోయి ముందుకు బయలుదేరింది. అందరికీ అందలమెక్కినంతయింది.

'బండీ బయలుదేరింది కాబట్టి నా కాలు మీద నుంచి కాలు తియ్యండి...'

గోపాలం కాళ్లు సర్దుకున్నాడు. బయట చీకటిగా, వెన్నెల రోజుల్లో మబ్బువేసినట్లుగా ఉంది. గేటుదగ్గర పార్వతి సామాను.

'ఇవ్వాళ తిధి ఏమిటండి...'

ముక్కు పొడుం పీలుస్తున్నాయన ఒక క్షణం ఆగాడు. గంధపుబొట్టు ఇంద్రధనస్సులాగా, కుంకుమ చంద్రబింబంలాగా, ముఖం ఆకాశం లాగా, కనబడుతున్నాయి గోపాలానికి. నవ్వువస్తే జేబురుమాల్లో దాచుకున్నాడు.

పట్టాలు ఆసరాగా చేసుకుని పరుగెత్తుతోంది రైలింజను. నాయకుడి వెనకాల వినాయకుల్లా పెట్టెలు వెంటనడుస్తున్నాయి—లేకపోతే వెంబడిస్తున్నాయో!

గోపాలానికి బెడ్డింగు కొద్దిగా కనబడుతోంది. దానిమీద ఎవరో కూర్చున్నారు. ఒకాయన కాళ్ళు పెట్టుకున్నాడు. ఇంకొకతను ఆనుకున్నాడు. అందరికీ అన్ని విధాలా ఉపయోగపడుతున్న బెడ్డింగు తనకు కొరగాకుండా పోతోంది.

'నువ్వుగూడా టిక్కెట్టు కొన్నావని తెలుసుగాని...అట్లామీద పడకుండా... పక్కగా నిలబడు...'

'మూల ఆడకూతురుందయ్యా..ఇంకా ఏంజరగమంటావు..'అంతా ఆడకూతురు వంకచూశారు. సంచిమీద ఒకచెయ్యి వేసుకుని, పక్కనున్న వాడిమీద — బహుశా భర్త లేక భరించేవాడేమో — ఒకచెయ్యి వేసుకుని నిద్రపోతున్నట్లు నటించలేక సతమతమవుతోంది పార్వతిని గూడా పిలిచి అక్కడ కూర్చోపెడితే తన బాధ్యత కొంతవరకు తీరుతుందనుకున్నాడు గోపాలం.

'సరిగ్గా కూర్చోమనండి...పడుకుంటే ఎట్లా...మేమూ టిక్కెట్టు కొన్నాం...'

'అబ్బా !!! నువ్వుగూడా కొన్నావు టిక్కెట్టు ... అవున్లే ... ఈ రోజుల్లో రైలుకు టిక్కెట్టు కొనుక్కుని ప్రయాణం చేసేవాళ్ళెంతమంది?...దావయ్యా..దా.. నా బుజం మీద కూర్చుందువు గాని...'

అతను కళ్ళెర్రచేశాడు.

టిక్కెట్టు కలెక్టరు వచ్చాడు. 'అంతా టిక్కెట్లు కొన్నారు గదూ...'అన్నాడు. గేటుదగ్గరే నిలబడ్డాడు. లోపలకు పోయేట్టుగా లేడు.

'జన్మలో రైలెక్కగూడదనిపిస్తుంది...ఛీ...ఛీ...'

'దీన్నే ప్రసూతి వైరాగ్యమంటారు..'

అంతా గొల్లుమని నవ్వారు — ఆడకూతురుతో సహా. ఆడకూతురు పక్కనున్న మగకొడుకు మాత్రం ముఖం చిట్లించి 'మేనర్సు లేవు...' అన్నాడు వినబడీ వినబడకుండా.

'టైమెంతయిందండి...' టిక్కెటు కలెక్టరు రిస్టువాచికి 'కీ' ఇస్తూ అడిగాడు. గోపాలానికి చిన్నప్పటి లెక్కల మేష్టరు చెవులు గుర్తుకొచ్చాయి.

మూలగా కూర్చున్న ఆడకూతురు లేచి కూర్చుంది. కళ్లు నులుముకుంది. కాటుక చేతికంటించుకుంది. పక్క నున్నతను 'ఏం కావాలి...' అని అడిగాడు.

'నిద్ర పట్టటం లేదు...' అంది. గోపాలానికి నవ్వు వస్తోంది.

ఆమె అతని బుజం మీద తల ఆనించి పడుకుంది.

అతను తృప్తిగా కూర్చున్నాడు. బుట్టలోనుంచి కమలా ఫలం ఒకటి తీసి, తొక్కు వలిచి పడెయ్యడానికి ఎక్కడా చోటు కనబడకపోయేటప్పటికి బుట్టలోనే పడేశాడు.

'రెండు తౌనలు తింటావా...' అతను అడిగాడు.

ఆ అమ్మాయి ఒకకన్ను తెరిచింది. రెండు తౌనలు తీసుకుంది. అంతా వాళ్లనే చూస్తున్నారు.

'ఏం కావాలి, అట్లా చూస్తావు...?' అతను గోపాలాన్ని అడిగాడు.

'మీ రిద్దరూ కలిసి ముగ్గురి చోటు ఆక్రమించుకున్నారు...అంతా ఇరుకుని నిలబడటం కనబడటంలేదా...?' 'భువన ఘోష వినబడటం లేదా ?' అన్నట్టు అడిగాడు.

'ఎంత దూరంనుంచి వస్తున్నామో తెలుసా ?'


'మహా అయితే మద్రాసునుంచి వస్తున్నారేమో!..లండను నుంచి అయితే రావటం లేదుగదా...'

'మాటలు జాగ్రత్తగా రానీయండి...'

'ఆడకూతురుంది......ఊరుకోండయ్యా...'

'ఆడకూతురు ... ఆడకూతురు ... ప్రతివాళ్ళూ ఇదోమాట నేర్చారు...'

'ఆడవాళ్ళ పెట్టెలో కూర్చోమంటారు ... అంతేగా ... అక్కడ కూర్చున్నంత అధ్వాన్నం ఇంకోటి లేదు నాయనా...రాక్షసుల్లాగా మీదపడతారు.. మీరు గాబట్టి ఒకమూలన్నా కూర్చోనిచ్చారు...' ఒకావిడ ఉన్న నిజం చెప్పినట్లు ముఖం పెట్టింది.



"మే మంతా కరంట్ లేక చీకట్లో గాలాడక చస్తుంటే మీరు సంతోషిస్తారేం ?"
"సినిమా కొచ్చేప్పుడు ఇంట్లో ఫాన్ ఆఫ్‌చేసి రావటం మర్చిపోయా."

గోపాలానికి గేటుదగ్గర పార్వతి గుర్తుకు వచ్చింది. లేనిపోని బాధ్యత మీదపడింది. అక్కడ ఎట్లా ఉందో. సామాన్లు జాగ్రత్తగా ఉన్నాయో లేదో ! మధ్య మధ్య పార్వతి అసలు ఉందో దిగి పోయిందో అన్న అనుమానం గూడా వేస్తోంది.

'ఏమండీ...గేటుదగ్గర ఆడమనిషి కూర్చోవటానికి చోటు దొరికిందా...'

'మీ ఆవిడా అండీ?'

'ఆవిడ మా ఆవిడ కాదయ్యా...'

'ఏ ఆడమనిషండి ?' ఇద్దరున్నారు అక్కడ. పార్వతిని ఎట్లా వర్ణించాలో తెలీలేదు గోపాలానికి. కనీసం ఏ చీరె కట్టుకుని వచ్చిందో గూడా తెలీదు...

ఎదురుగా కూర్చున్న మొగుడూ, పెళ్ళాల్లో మొగుడు లేచి నిలబడ్డాడు. ఒకళ్ళిద్దరి కాళ్లుతొక్కి బెర్తు మీదకు

వెళ్ళాడు. అతను పరిచిన బెడ్డింగే కాబోలు అది. ఆమె కాళ్ళు బల్లమీదకు పెట్టుకుని నిద్రకు ఉపక్రమిద్దామనుకుంది. భర్త లేచిన చోట ఏర్పడ్డ ఖాళీలో కాళ్ళు పెట్టుకోవటం వలన అక్కడ కూర్చున్నతనికి కాళ్ళు తగిలేట్టుగా ఉన్నాయి. పంఖా గాలికి చీరె రెపరెపలాడుతూ మధ్య మధ్య కొద్దిగా పైకి ఎగిరిపడుతోంది.

'తల ఇటుపెట్టి పడుకోమ్మా ...' ముసలమ్మ సలహా.

సలహా పాటించి కాళ్లు కిటికీవైపు పెట్టి పడుకుంది.

తల వైపున ఉన్న 'యువకుడు' నిద్ర నటించి మధ్య మధ్య తూలుతూ ఆమె మీదకు వరుగుతూ ఉలిక్కిపడి లేస్తూ అభినయం చేస్తున్నాడు. పైన బెర్తుమీద పడుకున్న అతని ప్రాణం కిందనే ఉంది. బొందె మాత్రం పైన ఉంది. ఆమె పక్కన కూర్చున్న యువడుకు ఆమె తలవైపు ఒరిగినప్పుడల్లా తేలు కుట్టినవాడులా చటుక్కున లేవబోయి 'ఎవరన్నా చూస్తారేమో' అని భయపడి మళ్ళీ ఊరుకుంటున్నాడు. రైల్లో ఇటువంటి చిన్న చిన్న విషయాలు పట్టించుకోగూడదు. ఒళ్లు, ఒళ్లు తగులుతుంది. రైల్వేలు బాగుపడి మనిషికీ, మనిషికీ మధ్య మీటరు దూరం ఉండి విశ్రాంతిగా కూర్చునే ఏర్పాట్లు వచ్చేటంతవరకు ముక్కు ముఖం ఎరగని వాళ్లు ఒక పెట్టెలోకి చేరి ఇట్లా అనుకుంటూ కూర్చునే పద్ధతి తప్ప దనుకున్నాడు. అతను నిద్రకు తూలటం గాదని అభినయమని గట్టిగా నమ్మకంగా ఉంది.

ఉండబట్టలేక కిందకు దిగి వచ్చాడు భర్త.

'మీరు దయచేసి సరిగ్గా కూర్చోండి...' అన్నాడు.

'మీకు పైన నిద్రపట్టటంలేదా... ?'

'అదంతా మీ కనవసరం...'

'అట్లాగా !...నాకు అవసరం అనుకున్నాను...' కొంతమంది నవ్వుతున్నారు. అతని ముచ్చటైన మీసాలు, సన్నని పెదిమలు, ఎత్తయిన చెక్కిళ్ళు, విశాలమైన నుదురు...అన్నిటినీ మించిన ఆ పదునైన కళ్ళు చూస్తుంటే... మరీ అసూయగా ఉంది.

'మాటలు జాగ్రత్తగా రానీయండి..'

'మీకు ఈమధ్యనే పెళ్ళయిందా... ప్రతాపం ప్రదర్శిస్తున్నారు...'

'ఏమిటా ధోరణి...పళ్ళు రాలతాయి...' అతను ఉగ్రరూపం దాల్చాడు : అప్పుడప్పుడే నిద్రపడుతున్న వాళ్ళంతా లేచి కూర్చున్నారు. గేటుదగ్గర పార్వతి సంగతి చూడలేకపోతున్నానేనని గోపాలం ఆవేదన పడుతున్నాడు.

'అర్ధరాత్రిపూట అంకమ్మ శివాలంటారు...అట్లా ఉంది...'

'ఇవాళ శివరాత్రి అయితే ఈ జాగరణకు కొంత అర్థం ఉండేది...'

టికెట్టు కలెక్టరు, పోలీసు — దేశం భవిష్యత్తును గురించి మాట్లాడు కుంటున్నారు.

ఆమె మళ్ళీ అతని భుజంమీదకు వరిగి కునుకుపాట్లు పడుతూంది. అంద మైన మీసాలతను ఏదో పుస్తకం తీశాడు చదివేవాడిలా. అందమైన పుస్తకం, అందులో అందమైన బొమ్మ లున్నాయి. 'ఆహా...ఆహా...' అంటు న్నాడు పేజీలు తిరగేస్తూ. ఆమె మధ్య మధ్య కళ్ళుతెరిచి పుస్తకం వంక చూస్తోంది. భర్తకు ఏమీ తోచలేదు. భార్య బెర్తుమీద పడుకుంటే తను కింద కూర్చుందా మనుకున్నాడు.

'నువ్వు పోయి పడుకో పైన...' అన్నాడు భార్యతో.

'పై కెట్లా పోయేదండి...?'

'పక్కన మెట్లులాగా ఉన్నాయి... అక్కడనుంచి ఎక్కొచ్చు...'

'సరే మీ ఇష్టం...'

ఆమె లేవగానే మీసాలతను పుస్తకం మూసి సంచిలో పెట్టాడు. ఆమె మెల్లగా మెట్లు ఎక్కి బెర్తుమీదకు పోతుంటే అంతా సర్కసులో ఉయ్యాల ఊగే మనిషిని చూసినట్లు కళ్ళు, మనసు అప్పగించి చూస్తున్నారు. మెల్లిగా బెర్తు మీదకు పోయింది. ఆ బెర్తుకు ఎదురుగా రెండో వరసలో ఇంకో బెర్తు ఉంది. అతను అటువైపు చూశాడు. బంగారు కళ్ళజోడువాడు అప్పుడే కళ్లు తెరిచాడు. ఆమె పడుకుంది.

అతను క్రింద కూర్చున్నాడేగాని ముళ్ళమీద కూర్చున్నట్లుంది.

బంగారు కళ్ళజోడువాడు గుడ్లన్నీ అప్పగించి ఆడవాళ్ళను చూడటం ఇదే మొదటిసారి అన్నట్లు కనపడుతున్నాడు. అతనికి చికాకుగా ఉంది. పక్క మీసా లతను ముసిముసి నవ్వులు ఒలకపోస్తు న్నాడు. కళ్ళజోడువాడు పైన ఆమె వంక చూశాడు. కళ్ళు మూసుకుంది. పంఖా గాలికి పమిట అటూఇటూ కదులు తోంది.

అతను సంచిమీదకు నడుం ఆనించాడు కునుకుపట్టింది. ఎన్నో కలలు. అన్నీ పీడకలలు. తను నిద్రపోవటం చూసి ఆమె మెల్లిగా బెర్తుమీదనుంచి దిగివచ్చి ఎక్కడకో వెళ్ళిపోయినట్లు, తనెంత వెదికినా దొరకనట్లు...తరవాత ఇంకో కల. పక్కనున్న మీసాలవాడు, పైనున్న కళ్ళజోడు వాడు కలిసి తనని చావకొట్టి, కాళ్ళు చేతులు కట్టేసి పోలీసు ముందర పడేసి ఆమెను చెరో రెక్క పట్టుకుని లాక్కుపోయినట్లు... అతను ఉలిక్కిపడి లేచాడు. పక్కన మీసాల వాడు కనిపించలేదు. గుండె వక్కసారి ఆగినట్లయింది. పైకి చూశాడు. కళ్ళజోడు వాడులేడు. గుండె వక్కసారి ఆగింది. చటుక్కున లేచి పైన బెర్తువంక చూశాడు. భార్య అక్కడే

వంటరిగానే ఉంది. గుండె మళ్లా ఆడటం మొదలు పెట్టింది.

అతని కంగారు చూసి నిద్ర పట్టక మేలుకున్నవాళ్లు పళ్లు బయట పెట్టారు. గోపాలానికి గూడా నవ్వాగింది కాదు. బెట్టింగువంక చూశాడు. భార్య గుర్తుకు వచ్చింది, పార్వతి గుర్తుకు వచ్చింది, అక్కడ ఎట్లా ఉందో! ఉందో అసలు దిగి పోయిందో అని బెంగగా ఉంది.

'అక్కడ గేటుదగ్గర ఆడమనిషి కూర్చుందేమో చూడు బాబూ...పేరు పార్వతి...' పక్కవాడి గడ్డం పట్టు కున్నట్లు మాట్లాడాడు.

'పార్వతమ్మగారు మీరేనా...'అతను రిలే చేశాడు.

'అవును...ఎందుకు...'

'మీ వారు అడగమన్నారు..'

'ఆవిడ మా ఆవిడ కాదయ్యా దేవుడా...'

విసుక్కున్నా పార్వతి గొంతు విన్న తర్వాత గోపాలానికి ప్రాణం లేచి వచ్చింది. కిటికీలోనుంచి బయటకు చూశాడు. ఏదో స్టేషను దాటిపోతోంది జి. టి. ఎక్స్‌ప్రెస్ దడదడా, బడబడా చప్పుడు. అక్కడ ఆగిన రైల్లోవాళ్ళు తమవైపు చూస్తున్నారు.

గడియారం మళ్లా ఆగిపోయింది. ఆగి ఎంతసేపయిందో తెలియదు.నిలబడి కునుకుపాట్లు బడ్డప్పుడు ఎంత సైము గడిచిందోఏమో...కాజీపేట వచ్చేసింది. ప్లాటుఫారం చాలా దూరం ఉందనగానే రైలు ఆగింది.

'కాజీపేట...కాజీపేట...' కూలీలు అరుస్తున్నారు. పెట్టెలో నుంచి చాలా మంది దిగిపోతున్నారు. కొంచెం కాళీ కాగానే గోపాలం ముందుకు రెండడుగులు వేసి గేటు దగ్గరకు వచ్చాడు. పార్వతి ముసిముసి నవ్వులు నవ్వింది.

'అంతా దిగిపోతున్నారేమండీ...' అంది.

'అదే నాకూ తెలియటంలేదు...'

కూలీ ఒకడు వచ్చాడు.

'ఏమండీ ...... హైదరాబాదు పోతారా...'

'అవును...'

'సామానుందా...'

'ఉంది...'

'అయితే పోదాం రండి...'

'ఎక్కడికి...'

'హైదరాబాదు పెట్టెలో పెడతాను..'

గోపాలానికి ఆముదం తాగినట్లు - పచ్చివెలక్కాయ మింగినట్లు... అయింది.

'అయితే ఈ పెట్టె హైదరాబాదు పోదా...?'

'ఇది ఢిల్లీ పెట్టె సార్ ... ఇంకా ఢిల్లీనుంచి ఎక్స్‌ప్రెస్ రాలేదు...కాళీ పెట్టె లున్నాయి...దాంట్లో సామాను పెడుదురుగాని పదండి.'

గోపాలం గబగబా పెట్టెదిగిచూశాడు. పెట్టెమీద 'ఢిల్లీ' అన్న చెక్క ఉంది. తను ఎక్కినప్పుడు 'హైదరాబాదు' అని చూసినట్లు గట్టిగా జ్ఞాపకం.

'కంప్లెయింట్ చేస్తాను...'అన్నాడు గోపాలం మండిపడుతూ.

'కంప్లెయింటు తర్వాత చేద్దురుగాని ...ముందు మనం హైదరాబాదు పెట్టె లోకి వెళ్ళే మార్గం చూడండి...' పార్వతి నోరు విప్పింది.

'కూలీ ఎంత...?'

'రూపాయిన్నర ఇప్పించండి...'

'ఈ కాస్త సామానుకు అంత కూలీనా...'

'ఇంత రాత్రి వేళ... అట్లాగంటా రేమండి...వందలకొద్దీ ఖర్చు పెడతారు, ...కూలీ దగ్గర పట్టుకుంటారు....'

'ఆవకాయజాడీకి కూలీ'వద్దులెండి... అంది పార్వతి. తాటాకు బుట్టలో జాడీ మూత కనబడుతోంది.

'మీరెం తిస్తారో చెప్పండి...' కూలీ తలపాగా చుడుతున్నాడు.

'అర్ధరూపాయ కంటె ఎక్కువ ఇవ్వను...'

'రూపాయి చేసుకోండి...'

కూలీ సామాను నెత్తిమీద పెట్టు కుంటున్నాడు.

'నాలిక పీక్కున్నా అర్ధరూపాయి కంటె ఎక్కువివ్వను...'

'రండి అమ్మగారూ...' కూలీ సామాను సర్దుకుంటున్నాడు.

'అమ్మగారు కాదు...' అని చెబుదా మనిపించింది గోపాలానికి. ఎంత మందితో చెపుతాడు. తలకాయ నొప్పిగా ఉంది. ఆవకాయ జాడీ ఎత్తబోయాడు. అరణ్యంలో భీముడు పోతూంటే అడ్డం వచ్చిన హనుమంతుడి తోక వ్యవహారం అయింది. రెండు చేతులతో బలవంతానా ఎత్తగలిగాడు. చేతిలో నరాలు విరిగిన చప్పుడయింది. సామానుతో సహా ముందుకు సాగారు.

'హైదరాబాదులో ఎక్కడుంటారు... చిక్కడపల్లిలోనా...'

'హిమాయత్‌నగర్‌లో...'

పట్టాలుదాటి, తీగెలుదాటి షెడ్డు దగ్గరున్న పెట్టెలోకి పోయేటప్పటికి సప్త సముద్రాలుదాటి చెట్టు తొర్రలోకి పోయినట్లయింది. పెట్టెలో దీపాలులేవు. కూలీ సామాను పైన సర్దేశాడు. గోపాలం పర్సుకోసం జేబులు సవరించు కుంటున్నాడు. పార్వతి జేబురుమాలు ముడి విప్పతీసి 'నే నిస్తాలెండి...'అంది.

'ఢిల్లీనుంచి రైలు రాగానే లైట్లు వేస్తారులెండి...' కూలీ వాళ్ళిద్దరివంకా చూసి నవ్వుకుంటూ వెళ్ళిపోయాడు.

పెట్టెలో చీకటి.

వాళ్ళిద్దరు...

గోపాలానికి ధర్మసంకటంగాఉంది. టైము మెల్లిగా గడుస్తోంది. ఒకళ్ళ ముఖం ఒకళ్ళకి కనిపించటంలేదు.

'ఈ పెట్టయినా హైదరాబాదు పోతుందని నమ్మకమేనా...?

'నాకూ సరిగ్గా తెలీదండి...కూలీ చెప్పడమే...!!

'మరి ఎవరూ రావటంలేదే పెట్టె లోకి...'

'టైము చాలా ఉందనుకుంటాను...'

గోపాలం ఆగిన వాచీవంక చూసు కున్నాడు. కాసేపు ఒకళ్ళముఖం ఒకళ్లు చూస్తూ కూర్చున్నారు.

'ఇలా ఊరికే కూర్చుంటే కాలక్షేపం కావటంలేదు...అంది పార్వతి. గోపా లానికి ఉక్కిరి బిక్కిరి అయి గొంతు తడి ఆరిపోయింది.

'మరి...?' తెల్లముఖం ప్రశ్నార్థ కంలా పెట్టాడు.

'ఏమన్నా కబుర్లు చెప్పండి...?'

'ఏమున్నాయి...'

'మీకు పెళ్ళయిందా...'

'ఊఁ...'

'మీ భార్య చాలా అందంగా ఉంటుం దనుకుంటాను...'

భార్యను పార్వతితో పోల్చుకున్నాడు గోపాలం.

'అదే, ఒక మాదిరిగా ఉంటుంది...' ఎదురుగా బెడ్డింగు కనబడింది.

'నా అంత అందంగా ఉంటుందా...?'

గోపాలం గుండెల్లో రైళ్ళు పరుగెత్తు తున్నాయి. పరంధామయ్య గురించి, పరంధామయ్య కూతుళ్ళను గురించి ప్రచారంలో ఉన్న కథలు కొన్ని తెలుసు. ఇంత ఆపత్తులో చిక్కుకునే రోజు వస్తుందని మాత్రం అనుకోలేదు. పార్వతివంక ఏకాగ్ర చిత్తంతో పరికించి తడబడుతూ 'తప్పు' అన్నాడు.

'ఏమిటి తప్పు ?' అంది పార్వతి.

గోపాలానికి తప్పేమిటో తెలియ లేదు. కళవళపడిపోయాడు.

'ఎంతసేపూ నేను మాట్లాడటమేగాని మీరు పెదిమ కదపటంలేదు...' అంది పార్వతి.

మాట్లాడటానికి సంగతులేం కనిపించ లేదు.

'నా కెందుకో భయంగా ఉందండి... ఈ మారుమూల పెట్టె... నరసంచారం లేదు...మీకు దయ్యాలంటే నమ్మక ముందా...' పార్వతి మాట్లాడుకు పోతుంటే అతని గుండెల్లో దేకినట్లుంది. ఒక దయ్యం ఇలాంటి ప్రశ్నే అడిగి మరుక్షణంలో మాయమయినట్లు ఒక కథ ఉంది. అది గుర్తుకు వచ్చింది.

పార్వతి మెల్లిగా వచ్చి గోపాలం పక్కగా కిటికీ దగ్గర కూర్చుంది. ఉక్క బోస్తోంది. బయట వానతుంపర పడు తుండటం, చలిగాలి వీయటంలాంటి కథల్లో పరిస్థితులు లేకపోవటం మంచి దయింది.

ఎవరూలేరు కాబట్టి సరిపోయింది. ఎవరన్నా చూస్తే!? ఒకళ్ళిద్దరు పెట్టె దగ్గరకు వచ్చారుగాని ఆడ, మగ కనపడే టప్పటికి గబగబా పెట్టె దిగిపోయారు.

పోలీసు ఒకడు వచ్చాడు. వీళ్ళిద్దరూ వంటరిగా ఉండటం చూసేటప్పటికి వాడికేమిటో అనుమానం తగిలింది.

'మాష్టారూ...' పోలీసు పిలుపువిని పార్వతి కొంచెం పక్కకు జరిగింది.

'ఈ పెట్టెలో కూర్చున్నారెందు కండి...'

'హైదరాబాదు పోవాలి...'

'కొబ్బరి చెట్టెందుకు ఎక్కావంటె... దూడ మేతకు అన్నట్టుంది...హైదరా బాదు పోయే వాళ్ళు ఈ చీకటి పెట్టెలో కూర్చుంటారా...ఆమె ఎవరండీ... మీ భార్యేనా...'

'కాదుగాని... ఈ గొడవంతా ఏమిటి...'

'అదే నేననుకున్నంత అయింది... మరి ఆమె ఎవరని? ఈమూల పెట్టెలో కూర్చుని కబుర్లు చెబుతున్నారు... ముందు పోలీసుస్టేషనుకు పదండి... అక్కడ అన్నీ చెబుదురుగాని...'

'ఎందుకు పోలీసు స్టేషను...ఈ సామానంతా ఉంది...ఎట్లా వచ్చేది...'

సామానుందనేటప్పటికి పోలీసు కొంచెం తగ్గాడు. కూలీ ఏదో మోసం చేశాడనిపించింది గోపాలానికి...




"బృహస్పతి దశలో నాకు డబ్బు వస్తుందని నీవే చెప్పావుగా, యిప్పు డరుస్తావెందుకు?"

గోపాలం ఒక్కడే బయలుదేరాడు. అక్కడ సబిన్స్పెక్టరుతో మాట్లాడి నిజం నచ్చచెప్పాడు. అక్కడి నుంచి కూలీ మాట్లాడుకుని వెళ్ళాడు.

రైలు పెట్టెలో పార్వతి కనిపించ లేదు. చాలా భయం వేసింది. ఎక్కడకు పోయిందో ఏమిటో. ఆ పెట్టె తా మెక్కినదేనాఅని అనుమానం కూడా వచ్చింది. బెర్తుమీద సామానులకోసం చూశాడు. అవన్నీ అక్కడే ఉన్నాయి. కూలీ, తనూ కలిసి పార్వతికోసం వెతికితే ఇంకో పెట్టె దగ్గర నిలబడి రైలింజనువంక చూస్తూ నిలబడింది.

సామానంతా సర్దుకుని ప్లాటుఫారం మీదకు వచ్చేటప్పటికి రైలు వెళ్ళి గంటన్న రయిందని తెలిసింది.

తెల్లవారేదాకా ప్లాటుఫారం మీదనే కూర్చోవాలి. అప్పుడుగాని హౌరా ఎక్స్

ప్రెసు రాదు. బెడ్డింగుమీద పడుకున్నాడు. పార్వతి పెట్టె కానుకుని పక్కనే కూర్చుంది.

'ఏమన్నా కబుర్లు చెప్పండి...' అంటోంది. గోపాలం వళ్లు మండి పోతోంది 'ఇదెక్కడి గొడవ వచ్చి పడిందిరా...' అని.

బండి సికిందరాబాదు చేరింది. పార్వతి బంధువులకోసం చూసింది. 'హైదరాబాదు స్టేషనుకు వచ్చి ఉంటారు' ...అంది.

స్నేహితుడు ఒకడు కలిశాడు. 'పిల్లలేరీ...' అన్నాడు.

'మా ఆవిడకాదు...' అన్నాడు గోపాలం పళ్ళు బిగపెట్టి.

'ఎవరి ఆవిడ ?' అతను అనుమానంగా చూసి నవ్వుకుంటూ వెళ్ళి పోయాడు.

బండి హైదరాబాదు చేరింది.

బంధువులు వచ్చారు.

'జి. టి. లో బయలు దేరుతున్నట్లు టెలిగ్రాం వస్తే పొద్దున వచ్చాం... ప్రయాణం ఆగిందేమో అనుకుని గూడా ఎందుకైనా మంచిదని ఈ బండికీ వచ్చాం...'

గోపాలం వారికి పార్వతిని, సామానునీ అప్పచెప్పాడు.

ఇంటికి వెళ్ళేటప్పటికి పొద్దుతిరిగింది. ఇంక ఆఫీసుకు పోయే టయిములేదు. చాల బడలికగా ఉంది. స్నానంచేసి భోజనంచేసి పడుకున్నాడు.

నాలుగు రోజుల తర్వాత రెండు ఉత్తరాలు వచ్చాయి. ఒకటి పార్వతి దగ్గరనుంచి. రైలుప్రయాణంలోసహాయం చేసినందుకు కృతజ్ఞతలు తెలుపుతూ. రెండోది పరంధామయ్య దగ్గరనుంచి. 'అమ్మాయి దగ్గరనుంచి ఉత్తరం వచ్చింది. సంగతులన్నీ తెలిసినాయి. ఎరుగున్న వాడివి గదా అని తోడు ఉండమని చెప్పాను, అమ్మాయి ఒంటరిగా రావటం అలుసు తీసుకుని రాత్రి కాజీపేటలో ఆగినసంగతి తెలిసింది. ఎరుగున్న వాడివై గూడా ఇంత అపకారం తలపెట్టు తావని అనుకోలేదు...'అని.

గోపాలం విస్తుపోయాడు. ఆరోజు పడ్డ అవస్థంతా గుర్తుకు వచ్చింది. వళ్ళు మండిపోయింది. పరంధామయ్య నుంచి ఇంత అపనింద ఎలాగూ వస్తుందని తెలిస్తే ఆ రాత్రి తనుఇంకొక రకంగా ప్రవర్తించే వాడినేమో ! అనుకున్నాడు.

